క్లుప్తంగా

పరీక్షల్లో ప్రతిభ చూపిన వార్షిక ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో ఆదిమూలపు సతీష్, తదితరులు

కర్నూలు సిటీ: స్థానిక ఏ క్యాంపులోని మదర్ థెరిసా ఫార్మసీ కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. వార్షిక పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్ పాల్గొని టాపర్లను అభినందించారు. విద్యార్థులు కనబరిచిన ప్రతిభ వారి భవిష్యత్తుకు మార్గం చూపుతుందన్నారు. ప్రణాళికతో చదివితే ఎంత లక్ష్యాన్ని అయినా సులువుగా సాధించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ మహాలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ కె.సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి ప్రాధాన్యం

కర్నూలు కల్చరల్: రాయలసీమకు ప్రత్యేకించి కర్నూలు జిల్లాకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి టీచర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఏదైనా పంటకు గిట్టుబాటు ధర దక్కకుంటే నిల్వ చేసుకునే అవకాశం ఉండేలా చూస్తున్నామన్నారు. వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పందికోన రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికీ రిజర్వాయర్లలో 73 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



పోటీలలో తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో మంగళవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా దాతల సహకారంతో నిర్వహించిన ఈ పోటీలలో మొత్తం 20 జట్లు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన జట్లకు తొలి ఐదు స్థానాలకు గాను వరుసగా రూ.30,016, రూ.20,016, రూ.15,016, రూ.10,016, రూ.5,016 చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలకు కబడ్డీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, పీఈటీ శ్రీనివాసులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

వంటగ్యాస్, ఇంధన ధరలు తగ్గించాలి

కర్నూలు కల్చరల్: వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.200 తగ్గించి ఓట్లు వేయించుకొని మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ప్రజలకు ఇచ్చిన మాటలను గాలికొదిలేసిందని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థలు, బడా పారిశ్రామిక వేత్తలకు ఊడిగం చేస్తూ పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. పేద ప్రజలు వాడుతున్న ఉజ్వల గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నగర అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : మ్యాడ్ స్క్వేర్, మైన్‌క్రాఫ్ట్ మూవీ, రాబిన్‌హుడ్, వీర ధీర శూర 2, ఆర్య2 (2009), సికందర్, ఎల్2 ఎంపురాన్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : రాబిన్ హుడ్, మ్యాడ్ స్క్వేర్, వీర ధీర శూర 2, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, 28 డిగ్రీ సెల్సియస్, శారీ, లవ్ యువర్ ఫాదర్, ఎల్2: ఎంపురాన్, సికందర్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : రాబిన్ హుడ్, మ్యాడ్ స్క్వేర్, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ
శ్రీరామ : ఆదిత్య 369 (1991), వృషభ
రాజ్ : ఆర్య2(2009)
భరత్ కాంప్లెక్స్ : శివజ్ఞ
విజయ థియేటర్ : మ్యాడ్ స్క్వేర్
విక్టరీ టాకీస్ : వీర ధీర శూర 2

సునీతమ్మా.. అహంకారం వద్దమ్మా!

- జగనన్న వెంట నడిచే లక్షలాది ప్రజలను అడ్డుకోవడం ఎవరి తరం కాదు
- కాటసానిని అడ్డుకోవడం అవివేకం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): తాము తలచుకుంటే రాప్తాడులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అడుగు పెట్టనివ్వమని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రగల్భాలు పలకడం అహంకారానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. మంగళవారం స్థానిక సీ.క్యాంపులోని కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జగన్ అంటే ఒంటరి కాదని కోట్లాది ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకున్న నాయకుడు అన్నారు. జగనన్న వెంట నడిచే లక్షలాది ప్రజలను అడ్డుకోవడం ఎవరి తరం కాదన్నారు. టీడీపీ నాయకులు తమ సొంత బలంతో గెలిచామని అనుకుంటున్నారని, అది మూడు పార్టీలు కలిసి వచ్చిన వాపు అని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలపై రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

కాటసానిని అడ్డుకోవడం సిగ్గుచేటు

కల్లూరు మండలం కొంగనపాడు ప్రజల ఆహ్వానం మేరకు ఆ గ్రామ రథోత్సవంలో పాల్గొనేందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని పోలీసులచే హౌస్ అరెస్టు చేయించి అడ్డుకోవడం టీడీపీ నాయకుల అవివేకానికి నిదర్శమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పండుగలకు, పెళ్లిళ్లకు కూడా వెళ్లరాదని కూటమి ప్రభుత్వం కొత్తగా చట్టం తేస్తుందేమోనని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలను వేధించడం మానుకొని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబును ముస్లిం సమాజం క్షమించదు

- వక్ఫ్ సవరణ బిల్లు మత స్వేచ్ఛపై దాడి
- 9 లక్షల ఎకరాల వక్ఫ్ భూమిని కొట్టేసేందుకే బీజేపీ కుట్ర
- వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ హాఫీజ్ మహమ్మద్ ఇలియాస్



మాట్లాడుతున్న షేక్ హాఫీజ్ మహమ్మద్ ఇలియాస్

కర్నూలు (టౌన్): ముస్లిం సమాజాన్ని నిర్వీర్యం చేసే వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ముస్లిం సమాజం క్షమించదని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ హాఫీజ్ మహమ్మద్ ఇలియాస్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక బళ్లారి చౌరస్తాలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ యాక్ట్ 1995ను సవరించిన కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్ ఎఫీషియన్స్ అండ్ డెవలప్‌మెంటు (ఉమీద్)గా మార్చిందని, అయితే ముస్లిం సమాజం ఈ బిల్లును దేశవ్యాప్తంగా తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ముమ్మాటికి మత స్వేచ్ఛపై దాడి చేయడమే అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26 లను ఉల్లంఘించడం కాదా అని ప్రశ్నించారు. దీనిపై రాజ్యాంగ పరిధిలో పోరాటం చేస్తామన్నారు. దేశంలోని 9 లక్షల ఎకరాల భూమిపై వక్ఫ్ బోర్డు తన హక్కులను కోల్పోయే పరిస్థితికి కారణమయ్యే ఈ బిల్లును సీఎం చంద్రబాబు ఎందుకు వ్యతిరేకించలేదని ప్రశ్నించారు. కీలకమైన సంఖ్యాబలం ఉన్న టీడీపీ ప్రారంభంలోనే ఈ బిల్లును అడ్డుకొని ఉంటే జేపీసీ దాకా వెళ్లేదా అని ప్రశ్నించారు. మరోవైపు వక్ఫ్ సవరణ బిల్లును చంద్రబాబు అడ్డుకుంటాడని జాతీయ మీడియాలో అనుకూలమైన అబద్ధపు ప్రచారాన్ని ఘనంగా చేయించుకున్నారని విమర్శించారు.

ప్రజాస్వామ్య విధానాలతో వైఎస్సార్‌సీపీ అడ్డుకుంటుంది

వక్ఫ్ సవరణ బిల్లును ప్రజాస్వామ్య విధానాలతో వైఎస్సార్‌సీపీ అడ్డుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీలకు జరుగుతున్న అన్యాయాన్ని తిప్పి కొట్టాలనే నిర్ణయానికి కట్టుబడి ఉన్నారని వివరించారు.

శిశువులకు వెయ్యి రోజుల వరకు ప్రాధాన్యత

కర్నూలు(అర్బన్): శిశువులకు మొదటి వెయ్యి రోజులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల సూచించారు. కర్నూలు ప్రాజెక్టు పరిధిలో మంగళవారం పోషణ పక్వాడ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ నిర్మల మాట్లాడుతూ.. పోషకాహారం, ఆరోగ్యంపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. జిల్లాలో 1886 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. శిశువుల ఆరోగ్యంపై మొదటి వెయ్యి రోజులు శ్రద్ధ వహించుట, లబ్ధిదారులు స్వయంగా నమోదు చేసుకునే విధానంపై ప్రచారం, కమ్యూనిటీ సహకారం ద్వారా పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం, పిల్లల్లో ఉబకాయాన్ని తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవనశైలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పీడీ వివరించారు. కర్నూలు ప్రాజెక్టు సీడీపీఓ అనురాధ, సూపర్‌వైజర్లు అనూష, వరలక్ష్మి, మాణిక్యమ్మ, చోతిమ, జమీలాబీ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సుంకం పేరుతో ధరల పెంపు తగదు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు కల్చరల్: ఎక్సైజ్ సుంకం పేరుతో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం తగదని, పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ ఓల్డ్‌సిటీ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఓల్డ్‌సిటీ ప్రధాన కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణితో ధరలను విపరీతంగా పెంచుతోందని ఆరోపించారు. పెంచిన ధరలు తగ్గించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం ఉపాధ్యక్షుడు డి.కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మహిమూద్, నాగరాజు, నూర్, కృష్ణ, రామకృష్ణ, సురేష్, నాసిర్, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి

పెంచిన గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని సీపీఎం కార్యవర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ.50 పెంచడం దారుణమన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ. 908కి చేరిందన్నారు. ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తుందన్నారు. సీపీఎం నగర నాయకులు జయమ్మ అధ్యక్షతన జరిగిన ధర్నాలో నాయకులు చాంద్ భాష, ఇలియాజ్ జహంగీర్, రాజు, శాలి భాష తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలతో ఎస్పీ భేటీ

కర్నూలు: జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కర్నూలు ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రిని ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలతో పాటు ఇతర అంశాలపై ఇరువురి మధ్య కొద్దిసేపు చర్చ జరిగినట్లు సమాచారం.

మంత్రికి స్వాగతం పలికిన అధికారులు

కర్నూలు కల్చరల్: రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడుకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్వాగతం పలికారు. మంగళవారం స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్‌కు వచ్చిన మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేలు అందజేశారు.

విభజించి పాలిస్తున్న బీజేపీ

కర్నూలు కల్చరల్: బీజేపీ ప్రభుత్వం విభజించి పాలిస్తుందని కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా ఆరోపించారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత కొద్దిరోజులుగా దేశంలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ప్రజలను విభజించి పాలించే విధంగా బీజేపీ ప్రభుత్వ వ్యవహరిస్తోందన్నారు. దేశంలో మైనార్టీలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు అనుకూలంగా కొందరు ముస్లింలతో కూటమి ప్రభుత్వం మాట్లాడిస్తుందన్నారు. కులాలు, మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొడితే సహించేది లేదని హెచ్చరించారు. నాయకులు అనంత రత్నం మాదిగ, బతుకన్న, లాజరస్, అబ్దుల్ హై, షేక్ మాలిక్, ప్రతాప్, వంశీ బాషా తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి శ్రీమద్రామాయణ మహాయజ్ఞం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు శ్రీమద్రామాయణ మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం మంత్రి టీజీ భరత్ తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో విశిష్టమైన మహా పండితులచే సంపూర్ణ సంస్కృత శ్రీమద్రామాయణ పారాయణం, రామాయణ మూల మంత్రాలతో యజ్ఞం, ప్రవచనాలు ఏర్పాటు చేశామన్నారు. గోదా గోకులం సభ్యులు పెరుమాళ్ల బాల సుధాకర్, చిత్రాల వీరయ్య, కంభం కృష్ణయ్య, గోవిందరాజులు, సురేష్, మాకం శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ప్రకాష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ మృతి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు చెందిన 38వ వార్డు కార్పొరేటర్ రాచపూడి రవికుమార్ అలియాస్ గిప్సన్ (48) అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు ఒక కూతురు ఉంది. ఆయన మృతి విషయం తెలుసుకున్న నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు కల్చరల్: తిరుపతిలో మే నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ నక్కి లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారన్నారు. ఆయన అధికారం చేపట్టి 11 సంవత్సరాలు అవుతున్నా ఎలాంటి ఉద్యోగ కల్పన జరగలేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ తరుణంలో తిరుపతిలో జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులతో సభలను నిర్వహించి నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష, జిల్లా సహాయ కార్యదర్శులు బీసన్న, రాజు, నగర అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేసే వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని ఎన్టీఆర్ వైద్యసేవ పథకం పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ-హాస్పిటల్‌ను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓపీ, ఐపీ, డిశ్చార్జ్ డేటాను ఈ-హాస్పిటల్‌లో నమోదు చేయాలన్నారు. క్యాజువాలిటీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తర్వాతే వార్డులకు రెఫర్ చేయాలన్నారు. ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఆసుపత్రిలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, వైద్యులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన పెంచాలి



పోషకాహారాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): మహిళలకు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన పెంచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ సూచించారు. ఆమె మంగళవారం కల్లూరులోని 9వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న పోషకాహార పక్షోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోషకాహార పక్షోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో ప్రజలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. దీనివల్ల మాతాశిశు ఆరోగ్యం మెరుగుపడి మాతాశిశు మరణాలు నివారించవచ్చన్నారు. సీడీపీఓ అనురాధ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పన్ను రాయితీని వినియోగించుకోండి



కార్పొరేషన్‌లో పన్ను కౌంటర్లను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): భవన ఖాళీ స్థలాల యజమానులు సత్వరమే ఆస్తి పన్నులను చెల్లించి 5 శాతం పన్ను రాయితీ పొందాలని నగరపాలక సంస్థ కమిషనర్ యస్.రవీంద్రబాబు సూచించారు. స్థానిక నగరపాలక సంస్థలో మంగళవారం పన్ను చెల్లించే కౌంటర్లను పరిశీలించారు. పన్నుదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 4వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 267 జారీ చేసిందని, దీని ప్రకారం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెలాఖరు 30వ తేదీ లోపు పన్నులు చెల్లించే వారికి రాయితీ అవకాశం ఉంటుందని తెలిపారు. రెండు రోజుల్లోనే రూ.2.5 కోట్లు పన్నులు చెల్లించడం హర్షణీయమన్నారు. త్వరలో నగరపాలక సంస్థ పరిధిలో మరో మూడు కౌంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు ఆన్‌లైన్‌లోనూ ఇంటి, తాగునీటి కొళాయి పన్నులు చెల్లించవచ్చన్నారు. పన్నులు చెల్లించని వారి ఇళ్లకు కొళాయి కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆర్‌ఓ జునీద్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు



ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

11న బీసీ సమరభేరి



పోస్టర్లను విడుదల చేస్తున్న నేతలు


కర్నూలు(అర్బన్): బహుజన్ సమాజ్ పార్టీ, బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బీసీ సమరభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఎస్పీ నగర కన్వీనర్ రాజ్‌కుమార్ అంబేడ్కర్ చెప్పారు. సమరభేరికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం స్థానిక బీసీ భవన్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ నడిమింటి బోయ రంగయ్య, సీనియర్ బీసీ నాయకులు టీ.శేషఫణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని 11న ఉదయం 10 గంటలకు స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 110 కులాలుగా ఉన్న బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కలిపించాలన్నారు. నేతలు రామాంజనేయులు, రవి, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గిగ్ కార్మికుల వివరాల నమోదు



కార్మికుల వివరాల నమోదును పరిశీలిస్తున్న జేసీఎల్ బాలునాయక్

కర్నూలు(అర్బన్): అసంఘటిత రంగాలు, గిగ్ కార్మికులను ఈ- శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియలో భాగంగా మంగళవారం స్థానిక అమెజాన్ సంస్థలో పనిచేస్తున్న గిగ్ కార్మికుల వివరాలను నమోదు చేయడం జరిగిందని కర్నూలు జోన్ సంయుక్త కార్మిక కమిషనర్ యం.బాలు నాయక్ తెలిపారు. ఈ - శ్రమ్ పోర్టల్‌లో కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకుంటే సామాజిక భద్రతతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక ప్రయోజనాలు పొందేందుకు వీలవుతుందన్నారు. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జోన్ పరిధిలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి కార్మికుల పేర్లను నమోదు చేయిస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలతో తమ పేర్లను నమోదు చేసుకున్న అనంతరం రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ లింకు అయిన మొబైల్ నెంబర్, పాన్‌కార్డును అందించాల్సి ఉందన్నారు. కామన్ సర్వీస్ సెంటర్లు, గ్రామ/ వార్డు సచివాలయాలు, సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయాల్లో కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఉప కార్మిక కమిషనర్ కే.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేశన్న తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..ల్లో

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశనగ	1007	6730
పొద్దుతిరుగుడు	4959	5119
ఆముదం	5871	6063
వాము	4318	21412
ఉల్లి	517	1348
ఎండుమిర్చీ	6509	11005
శనగలు	4959	6369
కందులు	3129	7089
మొక్కజొన్న	1950	2184
మినుములు	6800	7309
కొర్రలు	1479	2639
సోయాచిక్కుడు	1596	3869
సజ్జలు	2400	2400

ఫోన్: 08518-257204, 257661

వృద్ధుడికి అరుదైన ఆపరేషన్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో 78 ఏళ్ల వృద్ధుడికి అరుదైన ఆపరేషన్ చేసినట్లు సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ జానకిరామ్ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కర్నూలుకు చెందిన ఈ వృద్ధుడికి ఇటీవల అత్యంత అరుదైన ఎమియాండ్స్ హెర్నియా వచ్చిందన్నారు. సాధారణంగా అపెండిసైటిస్ వస్తే విపరీతమైన నొప్పి ఉంటుందని, కానీ అది బొడ్డు పక్కన ఉంటుందన్నారు. ఈయనకు నొప్పి గజ్జల ప్రాంతంలో రావడంతో దాన్ని తొలుత పట్టించుకోలేదని, తర్వాత నొప్పి ఎక్కువ కావడంతో ఆసుపత్రికి తీసుకొచ్చారన్నారు. వైద్యపరీక్షలు చేయగా అప్పటికే అపెండిక్స్ పగిలి పోయి ఉందన్నారు. ఆయనకు అప్పటికే గుండెశస్త్రచికిత్స చేసి ఉండటంతో జాగ్రత్తలు తీసుకుని చికిత్స చేశామన్నారు. అనంతరం లాప్రోస్కోపిక్ పద్ధతిలో అపెండిక్స్ తొలగించినట్లు తెలిపారు. ఆ తర్వాత ఓపెన్ పద్ధతిలో హెర్నియాకు శస్త్రచికిత్స చేశామన్నారు. ఇన్‌ఫెక్షన్ ఉన్నందున మెష్ పెట్టకుండా కుట్లు వేశామని తెలిపారు. శస్త్రచికిత్స చేసిన నాలుగు రోజుల తర్వాత ఆసుపత్రి నుంచి ఆయనను డిశ్చార్జ్ చేశామన్నారు. ఇలాంటి కేసులు చాలా అరుదైనవని, ఆపరేషన్ చేయడం కూడా కష్టసాధ్యమన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల పంపిణీ

కర్నూలు కల్చరల్: ఏపీ ప్రభుత్వం సమగ్ర శిక్ష, పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు (సీడబ్ల్యూఎస్ఎన్) ఉచిత ఉపకరణాలను జిల్లా ఇన్‌చార్జ్/రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్‌పాల్, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల పట్టాల రద్దు అన్యాయం

ఓర్వకల్లు: గత ప్రభుత్వం మండలంలోని నన్నూరు గ్రామంలో రెండో విడతలో పేదలకిచ్చిన ఇళ్ల పట్టాలను కూటమి సర్కారు రద్దు చేయడం అన్యాయమని సీపీఎం నాయకులు అన్నారు. మంగళవారం లబ్ధిదారులకు రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు జారీచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, నన్నూరు శాఖ కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామంలో సుమారు 800 మందికి రెండో విడతలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ ప్లాట్లను రీవెరిఫికేషన్ పేరుతో రద్దు చేయడాన్ని పూనుకుందన్నారు. పేదలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే మరోచోట ఇళ్ల పట్టాలు మంజూరు చేసి నిజాయితీ చాటుకోవాలన్నారు. లేదంటే పేదలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.